"కొంత కాలం క్రితం నేనూ ఆ నమ్మకంతోనే జీవించాను. ఇప్పుడా నమ్మకం లేదు;

"నీ కాస్త ధైర్యం ఓపిక అవసరం అనుకుంటా."

"నాకు కావాల్సినంత ధైర్యం వుండనే వుంది. ఓపిక అంటావా! ఆరేళ్లు...ఓపికపట్టిపట్టి—నా గుండె నీరసించింది."

"ఎంత చెప్పినా వినవేం? కనీసం నీ భార్యనైనా ఒకనిమిషం తల్చుకో"

"ఇప్పుడు నేను ఆమెను గురించి తలవటం లేదనా నీ ఉద్దేశం! ఆమెని పస్తు పడుకోపెడ్తూ నేను ఆమెని ఎంత ప్రేమించి ఏం ప్రయోజనం? ఎగ్నెర్టు మా యింటికి వచ్చిన రోజున ఆమె కేర్పడిన ఉత్సాహంతోనే నేనింత దూరం నడిచి రాగలిగాను."

టాం బ్రాక్ ఆలోచిస్తూ కూర్చున్నాడు.

జెస్సీ ప్రారంభించాడు. "నువ్వు దయదల్చాలి. నీ చెల్లెళ్ల గురించి ఆలోచించు! ఆమెకు రెండు పూట్లయినా అన్నం పెట్టాలిగదా? రెండోపిల్లాడికి అవిటి కాలు నయం చేయించాలి. చిన్న పిల్లాడికి పిప్పరమెంట్లు కొని పెట్టాలి, వాళ్లని సినిమాలకి కూడా తీసుకెళ్లాలి... నాకో జతబూట్లు ఒక సూటు కొనుక్కోవాలి. మైలుకి ఒక డాలర్ అంటే నెలకి అయిదు వందల డాలర్లు దాదాపు నా ఖర్చులు పోను, ఎంతో మిగులుతుంది. నేను రెండు నెలలే బ్రతికి వుంటాననుకో-ఎల్లాకి కొద్దో గొప్పో మిగిల్చిపోతాను. అదృష్టంవుంటే ఇంకో ఏడాది బ్రతికి వుంటానేమో! టాం! టాం! నాకీ ఉద్యోగం ఇప్పించాలి నువ్వు తప్పదు!"

"నీవనుకోవటం ఈ ఉద్యోగంలో చేరగానే చాలా సంతృప్తుడై వుంటావనా? అది వట్టి పిచ్చి మాట! ప్రతి నిమిషం-ఉద్యోగంలో వున్నా లేకపోయినా, ఏనిమిషాన ట్రక్కు ప్రేలిపోతుందో అని ఎదురుచూస్తూ నిరంతర భయంకర జీవితం గడపాల్సి వుంటుంది. అంతకన్న నరకం నయం."

"కావచ్చు. కాని, ఈ నిరుద్యోగ నరకం కంటే, తొడుక్కోడానికి గుడ్డలులేక పడే చలి బాధ కంటే, "ఉద్యోగం లేదు" అనే ఈ మానసిక నరకబాధ కంటే భయంకర జీవితం వేరే వుందా టాం? నేను నిశ్చయం చేసుకున్నాను."

"అయితే ఈ రాత్రికో నువ్వు ఉద్యోగంలో చేరు..." టాం గద్గదంగా అంటూ, విరక్తిగా కోపంగా, "ఇదిగో ఈ చిల్లర డబ్బులు తీసుకుని పోయి భోజనం చేసి సాయంత్రాని కిక్కడికి రా. పో..."

"థ్యాంక్యూ" అంటూ జెస్సీ బయటకి నడిచాడు. ఆ నిమిషాన ప్రపంచంలో అతనికంటే కులాసా వ్యక్తి మరెవరూ లేనట్టే భావించాడతను. ఈల వేసుకుంటూ బయటికి వెళ్ళిపోయినాడు.

ట్రాం బ్రాక్ కళ్ళల్లో నీళ్లు తిరిగినయ్. అతను నిస్సహాయుడై, రెండు చేతుల్తోనూ తల గట్టిగా అదిమి పట్టుకుని టేబిల్ మీద పడిపోయినాడు.

---

క థా ని క

# తెరవెనుక

"గోపి"

ఏ పెట్టెలో ఎక్కడమూ? — అన్న ప్రశ్న.

దూరపు ప్రయాణం, ఆలశ్యంగా వచ్చిన కంగారు, రిజర్వేషన్ దొరదలేదే అన్న విచారం. పాము నోట్లోకి పోతూన్న కప్ప మిడతకోసం నాలిక చాచుతుంది...ఎక్కబోయే పెట్టెలో 'యమలోకం' కనబడుతూనే వున్నా, అందమైన అమ్మాయి ఎక్కే పెట్టెకోసం ప్రాకులాడుతాం. అందులో ఏదో మజా ఉందనుకుంటాం.

సన్నని నడుము, నీలి జార్జెట్ చీర, [illegible] చెప్పులు, గాలిలో తేలిపోతూన్నట్లు జనసమ్మర్ధాన్ని తోసుకుపోతూన్న అమ్మాయి, నా ఆలోచనలకి ఒక స్థిరరూపం ఇచ్చింది. నాలుగు అడుగులు వేశానో లేదో, అరవై మైళ్ల వేగంలో పోతూన్న కారుకి అమాంతంగా బ్రేకుపడ్డట్టయింది.

"ఇదే పెట్టె, సామాన్లని పిల్లల్ని త్వరగా తీసుకురా" అని బంట్రోతుని ఆజ్ఞాపించింది

రిజర్వేషన్ చూచుకొని. ఆగి ఆమె ముఖం పరిశీలనగా చూచి, "ఈ గొంతు ఎక్కడో విన్నట్టుంది" అనుకున్నా...

"అందమైన ప్రతీ అమ్మాయి గొంతుకా ఎక్కడో ఒకచోట విన్నట్టుగానే ఉంటుందిలే" అని అంతరాత్మ పరిహసించింది. అదే క్షణంలో చిన్న మెరుపు మెరిసింది ఆమె కళ్లల్లో. నాకళ్లు చీకటి కమ్మాయి. ముందడుగు పడలేదు.

"మీపేరు శ్యామలరావు కదూ?" అని గానం చేసింది కోయిల స్వరంతో. నన్నే వడన్నా ప్లాట్‌ఫారంమీద తలక్రిందుగా పట్టుకున్నా అంత గాభరా పడివుండను. నా పేరేదో మరిచిపోయానా క్షణంలో! తడుముకుని ఔననేసరికి బ్రహ్మాండమైనది "ఎన్నాళ్లైందండీ మిమ్మల్ని చూచి. రండి టైంకూడా ఐంది. తాపీగా మాట్లాడుకుందా" అంటూ పెట్టెలోకి దారితీసింది.

"అంత తెలియకుండా పిలుస్తుందా? అసలు ఈమధ్య ట్రైన్లలో జరిగే చిత్రవిచిత్రసంఘటనలని చదివితే ఇదీ అల్లాంటిదేనేమో అనిపిస్తుంది. "స్పై" అంటే ఏం గొడవో! ఈ దొరికిన చక్కని సందర్భం విడిచిపెట్టడమూ? ఇంతకీ మొగాణ్ణే! "టు బి, ఆర్ నాట్ టు బి" అన్న షేక్స్పియర్ పడ్డ అవస్థలో పడ్డాం... రైలు కుయ్యగానే పెట్టెలో పడ్డాం ఆలోచనలకి స్వస్తి చెప్పి.

"నూటికి తొంభైపాళ్లు ఆ అమ్మాయి ఏదో పొరపాటుపడి ఉండాలి. ("గొంతుఎక్కడో విన్నట్టుందన్నావ్?" అంది హేళనగా అంతరాత్మ...) ఆమెని పలకరించాలి. సంగతి సందర్భాలు తెలుసుకోవాలి. 'మాకూమీకూ పూర్వ పరిచయం లేదూ' అని కాని తేల్తే ముందుసంగతి చూచుకోవాలి. పరిచయం కల్పించుకోలేకపోతే టిక్కెట్టు కలక్టరు వచ్చేలోపున మరో పెట్టెలోనికి ఉడాయించాలి. ఇన్ని ముఖ్యవిషయాలుంటూంటే నాలుక సమయానికి పిడచకట్టుకు పోయింది. మాటలు ఒకదానికొకటి రావడం మొదలు పెట్టాయి. "దీనిథస్సాగొయ్యా, తీరా సమయం దొరికాక ఒకమాటనబోయి ఇంకోమాట నేస్తాం టాను" అన్న గిరీశంగారికే ఇలాంటి అవస్థతప్పక పోతే నేననగా ఎంత?

"పెట్టెంతా పూర్తిగా చూచా. బోలెడన్ని వస్తువులు, థర్మాస్ఫ్లాస్కు, టిఫిన్ కేరియరు, డబుల్ హోల్డాలు, ఆఫీసరుఫక్కీలో ఉంది. నిద్రతో ఊగుతూన్న పిల్లల్ని సర్దుచెయ్యడంలో నిమగ్నురాలై ఉంది. ఆరేండ్ల అమ్మాయి నాలుగేండ్ల అబ్బాయి... రెండోతరగతి పెట్టె, నాకు తెలిసినంతమట్టుకు అపరిచిత యువతి, గుండెదడ పట్టిందంటే ఆశ్చర్యమా!

గిర్రున తిరిగి మందహాసంతో "కామేశ్వరినండీ" అన్నది. నే పోల్చుకోలేదన్న విషయం సులువుగా గ్రహించినట్లు... అదో ఆలీబాబాలో "ఓపెన్ సెసిమి"లా పనిచేస్తుందని చూచా, ఊహూ-అందలేదు. నాకు తెలిసిన, ఆ పేరుతో చలామణీ అవుతూన్న స్త్రీ రత్నాల జాబితా అంతా చూచాను, ఒకటి; మా మేనమామ మరదలి కూతురు, నల్లగా, పొట్టిగా పొందరకుంచంలా ఉంటుంది. రెండు: మా స్నేహితుడు, మూర్తి మరదలు...అంటే జ్ఞాపకం వస్తుంది. టీకి పిలిచి వాళ్ల మరదలుచేత తెప్పించాడు. అంతా అయ్యాక "ఎలా ఉందోయ్ మా మరదలు?" అని అడిగాడు. "భేషుగ్గా ఉంది. చదువుకుంటున్నారా?" అని అడిగా టీ త్రాగిన ఖుషీ మీదట. అక్కణ్ణుంచీ రోజూ అదేజిడ్డు రాసేడు పెళ్లి చేసుకోమని ఆఖరికి ఎల్లా తప్పించుకున్నానంటే, "పేరేం పేరన్నా?" "కామేశ్వరి" అన్నాడు విచారంగా ముఖంపెట్టి." మా వరసకి అక్కయ్య అయిన ఒక చుట్టం. వాళ్లమ్మాయిని నా కిస్తామని పట్టుపడితే ఒప్పుకున్న వారానికా అమ్మాయి అకస్మాత్తుగా చచ్చిపోయింది. ఆమె పేరుకూడా కామేశ్వరే నట!" అని చెప్పి చల్లగా టాపిక్ మార్చాను దీని పర్యవసానం చూద్దామని. దాంతో మళ్ళా ఆ వూసెత్తలేదు మా మూర్తి వాడి ధర్మమా అని.

అంతెందుకులెండి; సన్నని నడుము, విశాల నేత్రాలు వంపులుతిరిగిన దేహం, అంత పెద్ద స్టైయిలులో ఉన్న వ్యక్తెవ్వరూ నాజాబితా కందలేదు. చేసేదిలేక కళ్లు తేలవేశాను. ఏదో మింగలేనట్లు బాధపడుతూ పొడిగుటకలు వేశాను. ఆమె పరిస్థితి కూడా చెప్పనక్కరలేదు. చీర సర్దుకుని పిల్లలనేవో సర్దుతున్నట్లు వాళ్లపక్క తిరిగి, ఆఖరు

ఆయుధంలా విసిరింది, “మీరు పర్షాలో ఇంటరు చదవలేదా?” అని.

వచ్చిన ఒక్కజవాబు గట్టిగాచెప్పి మొద్దబ్బాయిలా “ఔన”న్నా. ఏదో గుర్తుకు వస్తూ జారుతూ ఉంది. మళ్ళా అంతరాత్మ పరిహాసిస్తుందేమో అన్న భయం. ఇన్నిటికంటే ప్లాట్‌ఫారంమీద నావాలకం కనిపెట్టి నన్ను ఫూల్ చేయటం లేదుకదా అన్న అనుమానం పేగుల మడతల్లో ఇంకా కొల్లాడుతూనేఉంది. ఆమెనిజంగా 'ఫూల్' చేస్తే ఏంచెయ్యాలి. అదే శీర్షికకింద, ఒక వెయ్యి విధాలు తెప్పించుకునేందుకు, డూప్లికేట్స్‌తోకూడా వ్రాసి పారేస్తున్నా బుర్రలో.

ముడుచుకొన్న ముఖం విప్పారింది. ఆమె జాగ్రత్తపడకపోతే ముఖంఅంతా కళ్ళై కూర్చుంటాయన్న భయంవేసింది. పువ్వులు విడుతున్నట్లు వెన్నెల కాస్తున్నట్లు, ఎన్నో ఉపమానాలు, కవులన్నవాళ్లు చెప్పేవారే. ఆమె నవ్వుడు వర్ణించాలంటే “అయితే మరేం మాయింట్లో అద్దెకుండేవారు” అన్నది జిలేబీ పాకం గొంతుకతో.

ఎంతపెద్ద బ్లండర్ చేశాను. అసలు నాకు తెలిసిన కామేశ్వరుల్లో ఒక ముఖ్యమైన కామేశ్వరినొదిలేశానంటే ఏమనుకోవాలి? ఇంతకీ ఇప్పుడేమనాలి? “ఓ మీరా?” అని లేచినిలపడాలా కూర్చొని మందహాసంచేసి, వెనక్కి కుషీగా చేరపడాలా? నమస్కరించాలా? ఏం చెయ్యాలి? వెంటనే ఏదో చెయ్యాలనిమట్టుకు తెలుసు. ఒక పిడుగూ, ఈ విషయం పుస్తకమన్నా వ్రాసినట్లు కనబడదు. పిల్లల్ని పెంచడం, కుక్కల్ని పెంచడం పావురాలని ఎగరవెయ్యడం, స్నేహితుల్ని జాగ్రత్త పెట్టడం అన్నిటిగురించీ పుస్తకాలు వున్నాయి. కాని ఇప్పటి పరిస్థితికి పనికొచ్చేవుంటే ఎంత బావుణ్ణు! కంగారునుండి రక్షించటానికిగా అన్నట్లు కుర్రాడు, ఏడుపు మొదలెట్టాడేదో తేలుకుట్టినట్లు. వాణ్ణి ఊరుకోపెట్టడంలో నా సంగతి మరిచిపోయిందామె.

ఇంతకీ ఈమె కామేశ్వరిట! ఎలా నమ్మడం ముందింట్లో నేనూ రమణ, వెనకింట్లో పక్షవాతం మొగుడు ముసలి అత్తగారు, మురికి గుడ్డలు, ముడుచుకున్న ముఖం, చింపిరి తల. పదిహేనేండ్ల పడుచు కామేశ్వరి, ఉండేవారం. రమణగాడు మాత్రం అనేవాడు, “ఓటి భర్త, సాధించుకు తినే అత్తగారు, పేదరికం పగవాడికన్నా వద్దురా! ఐనా ఆమె కళ్లల్లో ఉందిరా సిరి అంతా. నవ్వుతే చూచావూ ఎప్పుడన్నా ముత్యాలురా ఆమె పళ్లు...”

“అగవోయ్ అఘోరీ! నువ్విల్లా ఒళ్లు తెలియకుండా డబ్బా కొడుతూంటే, బోడిగుండు సి. ఐ. డి. లెవరన్నా వింటే గది ఖాళీ చెయ్యమంటారు. కొంచం కవిత్వం నేర్చుకుని, ఎంకి పాటల్లాంటివి వ్రాసి పారేయ్” అనేవాణ్ణి.

అదే సందర్భంలో మరో విషయం కూడా జ్ఞాపకం వచ్చింది. కలిసి ఉన్నవాళ్ళని విడదియ్యటం, కానిపేర్లని కలిపి వరసలు పెట్టడం, వీటినే సామాన్యుల పరిభాషలో సంకలనం వ్యవకలనం అంటారు. ఇది అమ్మలక్కల సంఘంలో ఒక ఆట. మేం గది అద్దెకి పుచ్చుకున్నాం. తరువాత, కామేశ్వరి నెల తప్పింది. దీన్ని సంకలనంచేసి చెప్పారు. బడిపిల్లలకి “గదినిచ్చిన ముహూర్తాన్న హాయిగా పిల్లా పాపాతో వుంటుందని” నాకు మా రమణగాడిమీద గట్టి అనుమానం తగిలింది. 'పిరికి' కదా, ఎలా ఇరుక్కున్నాడు? అని వాడికే అలాంటిదే నా మీద కూడా అభిప్రాయం ఉండేదిట. భట్టీ విక్రమార్కుడి కథలాగైంది.

ఒకాయన ఉచితంగా సలహా ఇచ్చాడు. “అయిపోయిందేదో అయిపోయింది. ఇహ ఇల్లు ఖాళీచేసి వెళ్ళి మరో చోట బుద్ధిగా చదువుకుంటే పరీక్షలు ప్యాసౌతారు” అని, “మీ నాన్నగారికి తెలుస్తే ఏమనుకుంటారు” అని సాగదీశాడు. నాకు చిర్రెత్తింది.

“ఏమీ కాలేదు. చాలాబాగా చదువుకుంటున్నాము. మా నాన్నగారికి తెలుస్తే సంతోషిస్తారు, అనుకుని”అని జబాబిచ్చేసరికి కాలు కాలిన పిల్లిలా జారుకున్నాడు.

మా రమణకూడా వాడు వెళ్ళిపోయినాక వెనకపాటపాడేడు. “పోదాం పదరా! ఎందుకొచ్చిన గొడవ”అన్నాడు.

నేకోపంగా “మాటలనేవి మనుష్యులుకాని,

కొంపలు కావు. నువ్వంటే, దొంగలా పోతావు, ఆమెక్కడికిపోగలదు? ఈ అపవాదులో మనం జఫాయిస్తే, మరీ ఎక్కువై ఆమె నెత్తిన పడుతుంది" అనేసరికి గమ్మని ఊరుకున్నాడు...

కుర్రాణ్ణి ఊరుకోపెట్టి, ఫలహారాలు, అవీ నాలుగు ప్లేట్లలోనీ పెట్టి, పిల్లలకీ, నాకూకూడా ఇచ్చి, అడిగింది సన్నగా, "రమణగారెక్కడండీ?" అని.

ఆమెకూడా నాలాగే పాతరోజులగురించే ఆలోచిస్తూందని చెప్పక్కరలేదు. "నాకు తెలిసినంతమట్టుకింకా జనాభా లెక్కల్లోనే ఉన్నాడు. ఇంటరుతో విద్యాసన్యాసం పుచ్చుకుని, వేక్సినేటరుగా చేరాడు. పెండ్లికి శుభరేఖ వ్రాశాడు. తరవాత ఎవరో రమణకిద్దరు పిల్లలని చెప్పారు. తరువాత ఏమీ తెలీదు" అని నాకు తెలిసింది నాలుగుముక్కల్లో చెప్పాను. దాణా పడితేనే కాని మాటలురావు. కాఫీతాగుతూ అడిగాను, "మీరింతగా మారిపోయాక ఎక్కడ మొదలుపెట్టి ప్రశ్నలువెయ్యాలో తెలియటంలేదు. మీరే చెప్పెయ్యండి సంగతంతా" అని, "ఇంతకీ మీరెంతదాకా ప్రయాణం?" అన్నాను.

"ఈ రైలు ఎంతదాకాపోతే అంతదాకానూ" అని చెప్పి, "మీరెంతవరకూ?" అంది.

"నేనూను" అన్నా, బలే ఆనందంగా. "ప్రారంభించండి మీ కథ" అన్నా.

"నాకూ ఎక్కడ మొదలుపెట్టాలో తెలీకుండా ఉంది" అన్నదామె.

"మొదలుదగ్గర ప్రారంభించి, చివరకంతం చెయ్యండి" అనేసరికి నవ్వి, చెప్పడం మొదలుపెట్టింది.

"అకాలంగా ప్రసవం వచ్చి, బిడ్డపోవడమే కాక, నాకూడా చాలా జబ్బుచేసింది. ఇంకా కాస్త నయమన్నా కాకుండానే, ముసలమ్మకి ఆయనకి కూడా జబ్బు. ఇంతకీ నేనొకత్తెను. ఆర్నెల్లులోగానే, ఇద్దరూ కాలధర్మంపొందారు నన్నొక ఏకాకిగాచేసి వదిలి. ఏంచెయ్యడానికి తోచకుండాఉన్న సమయంలో, మా తల్లితరఫు చుట్టమట, ఆప్యాయంగా ఆహ్వానించాడు. విజయనగరం. ఇంట్లో అడుగుపెట్టిందగ్గరనుంచీ ఇంటిడి చాకిరీ ఉచితంగా ఇచ్చేశారు నాకు. ఆయనకి 14గురు పిల్లలు......"

"మరి, మన దేశానికి కరువు వచ్చిందంటే తప్పా?" అన్నాను.

"ఓటి భార్య అని వేరే చెప్పక్కరలేదు... కాని విచిత్రమేమంటే విజయనగరం చేరాక నాకు చాలామంది దూరపు బంధువులున్నట్లు తేలింది. ఒకళ్ళకంటే ఇంకోళ్ళు రెండించీలు దగ్గరని, వాళ్ళింటికి వచ్చిఉండాల్సిందని కోరడం మొదలుపెట్టారు. ఎందుకు? ఉచితంగా చాకిరీ చేయించుకుందికి. బ్రతుకంటే అసహ్యంవేసేది. స్వతంత్రంగా జీవించడానికి ఏదన్నా ఉపాయం పన్నాలి అని ఆర్నెల్లు గడిపేశాను. పద్దెనిమిదో ఏడువచ్చింది. పాతవిగ్రహానికి పాలిష్ వేసినట్టు తయారైయ్యా...."

"అంటే, ఇప్పుడు చూస్తూన్నవ్యక్తి అనాటినించీ వచ్చిన మార్పుల మజా, అంతేనా!" అన్నా.

ఔనన్నట్లు బుర్రూపి మళ్ళా ఆరంభించింది.

గాంధీగారి సత్యాగ్రహం వాడుకచేసి, కొసకి సంగీతం కాలేజీలో చేరడానికొప్పుకునేవరకూ సాధించాను ఇంటాయన్ని. కాణీడబ్బు ఖర్చులేదు కాబట్టి. కాలేజీలో చేరినాక ఇంటావిడ మరీ కాల్చుకుతినేది. కూనిరాగాలుతీస్తే "సినిమాతారా తుందికామోసని" సణిగేది. కోపంవస్తే వెధవలు ఎల్లా గుండుగీయించుకుని, ఒంటిపూట భోజనం చేస్తూ పవిత్రంగా గడపాలో చెప్పేది. ఇంటాయన, కాలేజీలో చేరిందిమొదలు నన్ను కొరుక్కుతినేట్టుగా చూసేవాడు..."

"నాక్కూడా బలే లెంపకాయ తగిలిందను" కున్నాను. కాని నాలోనిమార్పు కనబడకుండా ప్రక్కగా తిప్పుకున్నా. చీకటికూడా పడడానికి సిద్ధంగాఉంది. పిల్లలు నిద్దరలేచి తల్లిచుట్టూ దాగుడుమూతలాడుకొంటున్నారు, మా మాటల కంతరాయంరాకుండానే. మళ్ళా ఆరంభించింది. "మా వీధిలో కుర్రాళ్లు నా వెనకాతల సినీమా తారలపేర్లు వర్ణించేవాళ్లు. కాలేజీకి వెళ్ళేప్పుడు వచ్చేప్పుడు చాలామంది గిరీశాలు, వాళ్ళు మాట్లాడుకునే సానుభూతి వాక్యాలు నాచెవుల్లో పడేట్టు చూచేవారు.

ఒకఏడాది సంగీతంయందుండే మమకారంలో

ఈ కష్టాల్ని లెక్కచెయ్యకుండా గడిపాను. ఇంత లోనే అంతరాయం వచ్చింది. సంగీతంనుంచి సంసారంలోకి గంతు వేశాను."

"అంటే?"

కొంటెగానవ్వి "పెళ్ళిచేసుకున్నానని అర్థం."

"ఆమాత్రం తెలిసింది. వాటి తబ్సీళ్లుకూడా చెప్పండీ అని ప్రార్థించుకోడం" అన్నాను తేలిగ్గా.

"చెబితే మీరు డబ్బుకోసం ఆశపడ్డానను కుంటారు."

"అనుకోనని హామీ ఇచ్చినా నా?"

"ఆహా!"

రెండునిముషాలు నిశ్శబ్దంలో కలిసిపోయింది.

"ఎవరో మిమ్మల్ని చూచి ప్రేమించారు" అన్నా కొంచెం జోతిష్యం తెలిసినట్లు.

ఔనన్నట్లు తలూపింది.

"ఆయనకి బోలెడు డబ్బుంది" అన్నా.

"లేదు" అందామె.

ఆమె అంతవరకూ చెప్పి ఊరుకోడం బాగు

"క్రాస్‌వర్డ్సు వచ్చాయి."

గట్టిగానవ్వి "ఎందుకంత కుతూహలం? చెప్పే ముందు ఏమంటారో అని ఆపాను" అని మళ్ళా ప్రారంభించింది.

"మాయింటి కెదురుగుండా ఒక డాక్టరు దిగాడు. యుద్ధనుంచి వచ్చాట్ట. బాగా 35 ఏళ్లుంటాయి. మాయింట్లో ఉచితంగానే వైద్యం చేస్తూండే వాడు. నేను అయన్నెప్పుడూ అంత పరిశీలనగా చూడలేదు.

ఒకనాడు సముద్రస్నానానికని చిన్నపిల్లల్ని నాకప్పగించి తక్కినవాళ్ళంతా కోనాడ వెళ్ళారు. మధ్యాహ్నం నాలుగ్గంటలకా డాక్టర్ మా యింటికి వచ్చి, పరధ్యాన్నంగా పిల్లలతో ఆడు కుంటూన్న నన్నుద్దేశించి,

"మీరెంతో అదృష్టవంతులండీ" అన్నాడు.

"డాక్టరుపేరు?" అన్నాను.

నవ్వుతూ "ఉషశ్రీ! మీ నాన్న పేరేంటమ్మా?" అడిగింది.

"డాక్టర్ సుందరం" అంది ఉషశ్రీ. వెనకాలే తమ్ముడు "దాత్తర్ సుందర" అన్నాడు. ఆల్లా కోరస్ ఒక నిమిషంకానిచ్చారు. ఇద్దరం నవ్వు కున్నాం. మళ్ళా ప్రారంభించింది.

"వెనక తిరిగి నమస్కరించి, "ఎందుకలా?" అన్నా కొంచం కోపంగానే."

"మీకు క్రాస్‌వర్డ్సులో పెద్ద బహుమానం రానున్నది. 'ఇదిగో టెలిగ్రాం'" అని ఎర్రకాగితం చూపించాడు.

"నాకర్థం కాక తెల్లపోయి నిలబడ్డాను. అప్పుడు చెప్పాడాయన. మిమ్మల్ని చూచిందగ్గరనుంచీ ఎంతో జాలి వేసేది. జాలి ప్రేమగా మారింది. రోజూ మిమ్మల్ని చూడకుండా ఉండలేకపోయీ వాణ్ణి. కలిసిరాకపోతుందాఅని, మీపేర క్రాస్‌వర్డ్సు కడుతున్నా. ఇన్నాళ్ళకి తగిలిందిగాలం" అంటే ఆశ్చర్యం వేసింది.

"మరి మీరుకూడా నన్ను దయతలుస్తే మనం పెండ్లిచేసుకోవచ్చుని" సారాంశం తేల్చారు.

"టైం కావాలని కోరాను. కాని ఎన్నాళ్లో చించినా అప్పటి జాలిసత్వంకంటే నయమనే తోచింది, నసించిన ఆశలు మళ్లా అంకురించాయి. తరువాత సాఫీగా జరిగిపోయాయన్నీ" అని ముగించింది.

"ఇప్పుడాయన ఎక్కడ?" అని అడిగా.

"కొలంబోలో-ప్రైవేట్ ప్రాక్టీసు. చాలా బాగుండండీ అక్కడ."

ఇంకా ఏవేవో ప్రశ్నలు ప్రత్యుత్తరాలు జరిగాయి.

రాత్రిభోజనం అందరికీ అమర్చింది. భోజనం చాలా ప్రశాంతంగా చేశాం. భోజనంచేస్తూన్నంత సేపూ, స్త్రీ అన్నది ఎంత "కాంప్లికేటెడ్ స్టఫ్" అనే ఆలోచించాను. అదే సమయంలో మా గిరీశం మాటలు జ్ఞాపకంవచ్చాయి. "వెధవ అన్న దెక్కడుందోయ్ వెక్కిరించే వెధవాయిల నోళ్ళల్లో ఉంది" అన్నది. నా ఆలోచనలన్నీ ఇక్కడ వ్రాస్తే బోరెత్తుతుంది. అందుకని ముగిస్తా కాని ఒకటిమాత్రం ఇప్పటికీ మరిచిపోను-ట్రైన్లో ఎక్కేముందు, ఎన్నోసార్లు ఎర్రగా బుర్రగా కన బడే అమ్మాయిలున్న పెట్టెల్లో ఎక్కాను, ఎందుకో నాకే తెలీదు. కాని వాళ్ళనిగూర్చి తెలీకముందు, నా ఆలోచనల్లో మార్పులేదు. ఈమెతో మాట్లాడాక అనుకున్నా, ప్రతీ అమ్మా యినిగూర్చీ కొంచంగా తెలుసుకుంటే, గౌరవం తప్ప మరేమీ ఉండదేమో అని. ★